క్లుప్తంగా

గృహ నిర్మాణాలకు అదనపు సాయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూపారాణి

జె.పంగులూరు: గృహాలు మంజూరై నిర్మాణం పూర్తికాని పేదలకు ప్రభుత్వం అదనంగా ఆర్థిక సాయం చేయనున్నట్లు ఎంపీడీఓ కె. స్వరూపారాణి అన్నారు. మండల పరిధిలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ కె. స్వరూపారాణి ఆధ్వర్యంలో పేదల గృహ నిర్మాణాలపై సమావేశ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ 10 డిసెంబర్ 2024కు మంజూరైన గృహాలు, వాటిలో పూర్తికాని గృహాలకు ప్రభుత్వం అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.7500 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ యర్రం శ్రీనివాసరెడ్డి, రావూరి రమేష్, ఓబులరెడ్డి, సుబ్బారావు, మండల స్థాయి అధికారులు, పీఆర్ఏఈ, హౌసింగ్ ఏఈ, ఏపీఎం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మైనార్టీ విభాగ కార్యదర్శిగా కబీర్


షేక్ కబీర్

చీరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శిగా చీరాలకు చెందిన ఎస్‌కే కబీర్‌ను నియమిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. తనకు మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా పదవి అందించినందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కోండ్రు కిరణ్

చీరాల: సెయింట్ ఆన్స్ స్కూల్, మరియమ్మపేట ప్రాంతాల్లో లక్షలాది రూపాయల విలువ చేసే భూమిని కొందరు ఆక్రమించుకుని, అమ్ముకుంటున్నారని శుక్రవారం తహసీల్దార్ గోపికృష్ణకు పలువురు ఫిర్యాదు చేశారు. 31వ వార్డు రోశయ్యకాలనీ, సెయింట్ ఆన్స్ స్కూల్, మరియమ్మపేటలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. పూర్తి సర్వే నిర్వహించి కబ్జాదారుల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు అందించాలన్నారు. తనపై సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని, విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించకుంటే ప్రభుత్వ భూములు, ఎండోమెంట్ భూములు ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు.

పి- 4 సర్వే పకడ్బందీగా పూర్తి చేయండి

బల్లికురవ: పి-4 సర్వే సమాచార సేకరణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని ఎంపీడీవో కుసుమ కుమారి కోరారు. శుక్రవారం సర్వేపై 20 సచివాలయాల్లోని సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో స్థానిక పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్, గృహనిర్మాణాల పురోగతిపై చర్చించారు.

వ్యాసరచన పోటీల్లో పాల్గొనాలి

పర్చూరు(చినగంజాం): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 135 వజయంతిని పురస్కరించుకొని చీరాల గెరాడ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు చైర్మన్ అల్లడి కనకరత్నం తెలిపారు. నేటి ఆధునిక భారత దేశంలో అంబేడ్కర్ రాజ్యాంగం సరైన రీతిలో సంతృప్తికరంగా అమలవుతుందా అనే అంశంపై పోటీ ఉంటుందన్నారు. విజేతలకు రూ.5,116, రూ. 3,116, రూ. 2,116 వరుస బహుమతులుగా ఇస్తామన్నారు. కాగా ఏప్రిల్ 4వ తేదీ లోపు రూ. 100 ఎంట్రీఫీజు చెల్లించి పోటీలో పాల్గొనాలని వివరించారు. ఏప్రిల్ 5వ తేదీ లోపు తమ వ్యాసాలను గెరాడ్స్ ఫౌండేషన్. డోర్ నంబర్ 13-43-20 విలేకరుల కాలనీ, కొత్తపేట, వేటపాలెం మండలం, బాపట్ల జిల్లా, పిన్ 523157 అనే చిరునామాకు పంపాలన్నారు. పూర్తి వివరాలకు 9032558574 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రజలకు మంచి చేయండి

అద్దంకి: అధికార మందంతో ప్రజలకు మంచి చేయాల్సింది పోయి రెడ్ బుక్ రాజకీయాలు చేస్తే ప్రజలు తగిన సమయంలో తగిన బుద్ధి చెబుతారని భారత్ చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ అన్నారు. ఆయన శింగరకొండ తిరుణాళ్లకు సొంతంగా ప్రభను కట్టారు. ఆయన మాట్లాడారు ప్రజలకు మంచి చేస్తారని ప్రజలు కూటమికి అధికారం ఇచ్చారన్నారు. వ్యక్తిగత కక్షలు సాధిస్తూ. పోలీసులను అడ్డం పెట్టుకుని తప్పుడు కేసులు పెట్టి వేధించడం సరికాదన్నారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు ఉన్నారు.

కొండపై ఆధ్యాత్మిక శోభ

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి, కొండపైనున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం స్వామివారిని భక్తులు విశేషంగా దర్శించుకున్నారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన బొమ్మల దుకాణాలు, చెరుకు అంగళ్లు, జైంట్ వీల్, ప్రభలు ప్రత్యేక అకర్షణగా నిలిచాయి. అదే విధంగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. విద్యుత్ వెలుగులతో క్షేత్రం పట్టపగలును తలపించింది.


ప్రత్యేక పూజల్లో అర్డీఓ


తిరునాళ్లలో ఏర్పాటు చేసిన జైంట్ వీల్


తిరునాళ్లలో ఏర్పాటు చేసిన బొమ్మల దుకాణం


బోటులో షికారు


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



వైద్య శిబిరం


రోటరీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

పొగాకునూ వదలరా?


పందిళ్లపై ఆరబెట్టిన పొగాకు తాళ్లు


పూనూరుకు చెందిన దిశ బాబు చెందిన పొగాకు చెక్కులను అపహరించింది ఇక్కడే..

- పందిళ్లపై ఉన్న పొగాకు తాళ్లను అపహరిస్తున్న దుండగులు
- ఆందోళనలో రైతులు

యద్దనపూడి: బంగారం, విలువైన వస్తువుల చోరీ చేయడం దొంగలకు పరిపాటే.. కానీ ఇప్పుడు వారు రూటు మార్చారు. కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంటను సైతం రాత్రికి రాత్రి ఊడ్చుకెళ్తున్నారు. ఒకవైపు ప్రకృతి పగబట్టి అన్నదాతను ముంచుతుంటే మరోవైపు పందిళ్లపై ఆరబెట్టిన పొగాకు తాళ్లను దొంగలు అపహరిస్తున్నారు. పంటలు సక్రమంగా పండక, పండించినా గిట్టుబాటు ధర లేక నానా అవస్థలు పడుతుంటే దొంగలు వరుస దొంగతనాలు రైతులకు గోరుచుట్టపై రోకటిపోటులా మారింది. పొగాకుతాళ్లు ఆరబెట్టటం పొలాల్లో కావటంతో రాత్రి సమయాల్లో కొందరు దుండగులు ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలతో తాళ్లను అపహరిస్తున్నారు. వారం రోజులుగా మండలంలో ఏడుచోట్ల పొగాకు తాళ్లను దొంగలు ఎత్తుకెళ్లారు. చింతగుంటపాలెం సమీపంలో జాలయ్య అనే రైతు పొలంలో 4 క్వింటాళ్ల పొగాకు, గద్దల శ్యాంబాబు అనే రైతు వద్ద 3 క్వింటాళ్లు, బేతపూడి దిశబాబు వద్ద 3 క్వింటాళ్లు, ఉప్పుటూరుకి చెందిన రైతు పొలంలో 6 క్వింటాళ్లు, అలాగే మరో 3 చోట్ల సూమారు 10 క్వింటాళ్ల పొగాకు తాళ్లను దొంగలు అపహరించారు.

కాపలాగా వెళ్లాలన్నా భయమే...

పగటి వేళ దొంగలు పంట ఉన్న తోటల వద్ద రెక్కీ నిర్వహించి రాత్రి వేళ బృందాలుగా ఏర్పడి ట్రాక్టర్ల సాయంతో చోరీకి తెగబడుతున్నారు. ఒకవేళ రైతులు పందిళ్ల వద్ద కాపలాగా ఉండాలన్నా దాడులకు పాల్పడుతున్న వార్తలు వస్తున్న నేపథ్యంలో పహారా కాసేందుకు రైతులు జంకుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘా పెట్టి.. పంట కాపాడాలని రైతులు కోరుతున్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న ఈఓఆర్‌డీ శ్రీనివాసరావు

కారంచేడు: అసంపూర్తిగా నిలిచిన గృహాలను గుర్తించి త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేయాలని ఎంపీడీఓ కె. నేతాజీ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం గతంలో బీసీ, ఎస్సీలకు ఒక యూనిట్‌కు రూ. 1.80 లక్షలు కాగా ఇప్పుడు మరో రూ. 50 వేలు మంజూరు చేస్తోందన్నారు. ఎస్టీలకు గతంలో రూ 1.80 లక్షలు కాగా ఇప్పుడు మరో రూ. 75వేలు ఇస్తామన్నారు. మండంలో ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూట్ బ్యాగ్‌ల వాడకం, వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఏఈ ఖాశీం సాహెబ్, అన్ని గ్రామాలకు చెందిన కార్యదర్శులు, సచివాలయ ఇంజినీర్లు, గృహ నిర్మాణశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు: పేదల ఇంటి నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందజేస్తోందని ఎంపీడీఓ వి. ప్రద్యుమ్న కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ సమావేశం హాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, హౌసింగ్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, బీసీలకు అదనంగా రూ. 50 వేలు, ఎస్టీలకు అదనంగా రూ. 75 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. హౌసింగ్ ఏఈ రమేష్, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


కారంచేడులో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ, ఏఈ, సిబ్బంది

వేటపాలెం: గృహ నిర్మాణ శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న అదనపు సాయంతో నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి రాజా డెబోరా పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాల్లో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజిరింగ్ అసిస్టెంట్లుకు సమావేశం శుక్రవారం నిర్వ హించారు. ఈఓఆర్‌డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలం పరిధిలో గృహనిర్మాణ శాఖ ద్వారా ఇళ్లు మంజూరై అసంపూర్తిగా నిలిచి పోయిన 230 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సహాయం అందించనున్నదని తెలిపారు. అసంపూర్తిగా నిలిచిపోయిన గృహాలకు సంభందించి ఎస్సీ లబ్ధి దారులకు 57 మంది, ఎస్టీ లబ్ధిదారులు 35 మంది, వెనుక బడిన తరగ తుల లబ్ధిదారులు 138 మంది ఉన్నారని తెలిపారు. పీ4 సర్వేలో క్యూఆర్ కోడ్ ద్వారా అందరు తమ అభిప్రాయాలు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేష్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

యద్దనపూడి: పీఎంఏవై పథకం ద్వారా నూతన గృహనిర్మాణాలు చేపట్టేవారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ ప్రకాష్‌రావు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో పీఎంఏవై పథకం కింద ఇప్పటి వరకు 342 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షల సాయం అందుతుందన్నారు. అలాగే మండలంలో 2019-2024మధ్య పేదలకు మంజూరుచేసిన గృహాల్లో అ సంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణాలకు ప్రభుత్వం ఎస్సీ, బీసీ లకు రూ.50 వేలు,ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున ఆర్థికసాయం చేస్తుందన్నారు. ఈ నెల 17 నుంచి సర్వే నిర్వహించి లబ్ధిదారుల వివరాలు నమోదు చేసి మే చివరినాటికి అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణాలను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈఓఆర్డీ కృష్ణ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కన్నుల పండువగా స్వామి కల్యాణం


కారంచేడులో శాంతికల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడులో కొలువైన భూసమేత వెంకటేశ్వరస్వామివారి ఆలయ 23వ వార్షికోత్సవంలో బాగంగ గత మూడు రోజుల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకములు నిర్వహించారు. దీనిలో భాగంగా శుక్రవారం స్వామి వారి శాంతి కల్యాణంను కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంక్షిప్తంగా

ఉల్లాసంగా పౌర్ణమి, హోలీ వేడుకలు

బల్లికురవ: పాల్గుణ మాసం పౌర్ణమి సందర్భంగా మండలంలోని ఆలయాల్లో అమ్మవార్ల విశిష్ట పూజలతోపాటు హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చెన్నుపల్లి , కొండాయపాలెం, కొణిదెన, ముక్తేశ్వరం, అంబడిపూడి, గొర్రెపాడులోని ఆలయాల్లో అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. బల్లికురవ, కొత్తమల్లాయపాలెం, పాతమల్లాయపాలెం, కొండాయ పాలెం, వేమవరం, కొణిదెన గ్రామల్లో గ్రానైట్ క్వారీలు, పరిశ్రమలో పని చేసేందుకు వచ్చిన వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఘనంగా నిర్వహించుకున్నారు.

మేదరమెట్ల: హోలీ పండుగను పిల్లలు పెద్దవాళ్ళు శుక్రవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతల మధ్య పండుగను నిర్వహించారు.

అర్హులైన పేదలకు స్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న రమాదేవి

చీరాల: పట్టణంలోని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బి.రమాదేవి అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్థానిక సమస్యలపై ప్రజా చైతన్యయాత్రలలో భాగంగా శుక్రవారం చీరాల పట్టణంలోని 27వ వార్డు జయశంకర్‌నగర్‌లో ఇంటింటి సర్వేలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అద్దెల ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం మన మంచి ప్రభుత్వం అని ఇంటింటికీ పోస్టర్లు వేసి ప్రచారం చేసుకుంటూ ప్రజలపై అధిక భారం మోపుతోందని విమర్శించారు. ఎన్నికల ముందు ఆర్భాటంగా ప్రకటించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, మహిళలకు పెన్షన్లు అమలుకు నోచుకోలేదన్నారు. సీపీఎం చీరాల ప్రాంతీయ కార్యదర్శి ఎన్.బాబూరావు, చీరాల ప్రాంతీయ కార్యదర్శి ఎన్.బాబూరావు, కమిటీ నాయకులు ఎం.వసంతరావు, ఎల్.జయరాజు, టి.సుబ్బారావు పాల్గొన్నారు.

మండల భవన సముదాయంలో మద్యం సీసాలు


పడవేసి ఉన్న మద్యం సీసాలు

చినగంజాం: మండల భవన సముదాయంలో తరచుగా మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. శుక్రవారం కనిపించడంతో ప్రజలు విస్తుపోయారు. చినగంజాం మండలంలో మండల భవన సముదాయానికి ఒక ప్రత్యేకత ఉంది. ఈ సముదాయం నందు తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, హౌసింగ్ కార్యాలయం, వెలుగు కార్యాలయం, ఉపాధి హామీ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, మండల విద్యావనరుల కేంద్రం, అంగన్ వాడీ కేంద్రం, కస్తూర్బా బాలికా విద్యాలయం వంటి పలు కార్యాలయాలు నెలకొని ఉన్నాయి. అంతే కాకుండా పగటి పూట కార్యాలయం సిబ్బంది ఉంటుండగా, రాత్రి వేళ మండల తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాలకు నైట్ వాచ్‌మన్‌లు సైతం విధులు నిర్వహిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా మద్యం ప్రియులు కార్యాలయ ఆవరణలో మద్యం తాగి అందుకు ఆనవాలుగా సీసాలు అక్కడే పడవేసి ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోందని, నైట్ వాచ్‌మన్‌లు అసలు విధులు నిర్వహిస్తున్నారా అనే అనుమానం కలుగుతోంది.

భక్తిశ్రద్ధలతో వీరరాఘవ స్వామి కల్యాణం


కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీ వేదవల్లి, కనకవల్లి సమేత వీరరాఘవస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివార్ల శాంతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవ మూర్తులను ఉంచి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజల అనంతరం కల్యాణాన్ని నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి వీసీ కృపారావు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణం తిలకించారు.

ఘనంగా వీరాంజనేయ స్వామి తిరునాళ్ల మహోత్సవం


వీరాంజనేయ స్వామి ఆలయంలోపూజలు చేస్తున్న భక్తులు


విద్యుద్దీపాలతో అలంకరించిన నిర్వాహకులు

చినగంజాం: మండలంలోని కొత్తపాలెం పంచాయతీ బాగ్యనగర్ మార్కెట్ సెంటర్ నందు వేంచేసియున్న వీరాంజనేయ స్వామి తిరుణాళ్ళ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తిరుణాళ్ళను పురస్కరించుకొని భక్తులు శుక్రవారం ఉదయం నుంచి ఆలయానికి విచ్చేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకుడు మాజేటి శ్రీనివాసరావు పూజా కార్యక్రమాలను నిర్వహించగా భక్తులు విరివిగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, ఆకుపూజలు, పొంగళ్ళు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీప కాంతులతో అత్యంత సుందరంగా అలంకరించారు. సాయంత్రం శ్రీలలితా దేవి కోలాట ప్రదర్శన, రాత్రికి ఆలయం ఆవరణలో సాంఘిక నాటక ప్రదర్శన నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు.


ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

పరిశ్రమల స్థాపనకు సహకారం

చీరాల టౌన్: భారత ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పథకం ద్వారా యువ పారిశ్రామిక వేత్తలను తయారు చేసేందుకు అనేక పథకాలు, రాయితీలు అందిస్తుందని వీటిని సద్వినియోగం చేసుకుని వృద్ధి చెందాలని కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి సూచించారు. శుక్రవారం చీరాల మండల పరిషత్ కార్యాలయంలో యువ పారిశ్రామిక వేత్తలకు కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు, రాయితీలపై 'ప్రధానమంత్రి ఉపాధికల్పన' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా నూతన ఆలాచనలు, ఆవిష్కరణలతో స్వయం ఉపాధి సాధించేలా పారిశ్రామికంగా ముందుకు వెళ్లాలన్నారు. నూతన పరిశ్రమలకు ఇచ్చే రాయితీలు, పథకాల గురించి వివరించారు. డీవీసీ రామకృష్ణ, డైరెక్టర్ గ్రీస్, బీసీ కార్పొరేషన్ ఏఈఓ చిట్టిబాబు, డీఆర్‌డీఏ డీపీఎం లక్ష్మణాచారి, ఏపీఎం మధుసూదన్, అంజిబాబు, ఏడీ వాణి తదితరులు పాల్గొన్నారు.


సూచనలందిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com